
# అధికారం



" రెండ్రోజుల్నుండి చూస్తున్నాను. ఎన్-టెన్ వార్డులో ఓ పేషెంట్ ఈపాటికి జేకొట్టేయాలి. ఏంటో, ఈరోజసలు బోణీయే కాదు. ఎవరో వొకడన్నా గుట్టుక్కుమనకపోతే మనకెలా గడుస్తుంది. టాక్సీ వోళ్లు తెగ గోలపెడుతున్నా ఒక్క డెడ్ బాడీ కూడా డిక్కీ వరకు రావడంలేదే, ఏంటోలే ఆ నర్సింగ్‌హోమ్‌లే నయమనుకో రోజుకి నాలుగైదు శవాలు వస్తాయి. అందరికీ చేతినిండా డబ్బులాడతాయి". అంటూ గేటు ముందర కూర్చుని, సిగరెట్ల పొగను రింగులు రింగులుగా వదులుకుంటూ ఆసుపత్రి, చప్రాసీలు, వార్డ్‌మెన్‌లు చర్చావేదికలో తలనమునకలై వున్నారు.

చప్రాసీ డేనియల్ డ్యూటీ ముగించుకొని డ్రెస్ మార్చుకొని గేటు దాటిపోతుండగా కర్ణ కఠోరమైన మాటలు విని నీరుగారిపోయాడు.

కరెన్సీ నోటు చూడనిదే కనికరం చూపని సిబ్బంది. కాసుల సవ్వడి విననిదే పేషెంట్స్‌ను గేటు దాటి లోపలికి రానివ్వక,పైకి పోనివ్వక అడ్డుకునే కింది తరగతి పనివారల దాష్టీకం చూసి నివ్వెరపోయాడు డానియల్. తండ్రి చావు ఉద్యోగ బిక్ష పెట్టింది. డేనియల్ ఉద్యోగంలో చేరి నెల రోజులు కాలేదు. తండ్రి ధర్మాసుపత్రిలోనే చప్రాసీగా పాతికేళ్లుగా అందరి దగ్గర చేయిచాచి డబ్బు గుంజి, సారా ఫుల్ బిగించి, ఒంట్లో జబ్బును బాగా ముదరబెట్టుకొని ఇదే ఆసుపత్రిలో నికృష్టపు చావు చచ్చాడు. ఆసుపత్రి సూపరింటెండెంట్ ధర్మమా అని డేనియల్‌కు అదే క్లాస్‌ఫోర్ జాబ్‌లో చేర్పించాడు.

డేనియల్ వయస్సు పాతిక దాటలేదు. ముక్కుసూటి వ్యక్తిత్వం. నీతిగా, నిజాయితీగా బతకాలన్నా తత్వం. కాని వాస్తవాన్ని అవలోకించినప్పుడు ఏమాత్రం తేడా కనిపించినా జీర్ణించుకోలేనివాడు.

ఒకరోజు క్యాజువాల్టీలో డ్యూటీ పడింది. రోగుల రద్దీ విపరీతంగా ఉంది. ఓపి టికెట్స్ రాయలేక గుమస్తా విసుక్కుంటున్నాడు. చేతిలో నోటుపడితే హుషారొస్తుంది. లేకపోతే ముఖంలో, మాటలో చీదరింపు, ప్రవర్తనలో మిడిసిపాటు.

అతని పద్ధతి డేనియల్‌కు మింగుడుపడలేదు. పేషెంట్ల మీద కనికరం అతన్ని నిలువనీయలేదు.

'అదేంటిసార్, ఓపి టికెట్ అయిదురూపాయలైతే పదినోటు నొక్కేసి చిల్లరలేదంటున్నావ్. సొరుగులో ఉండి కూడా అబద్ధాలాడుతున్నావ్.' అంటూ అందరి తరపున వకల్తా పుచ్చుకున్నవాడిలా దురుసుగా మాట్లాడాడు.

గుమస్తా గుడ్లిమిరినట్లు చూశాడు.

ఏంటోయ్, పెద్ద మాట్లాడుతున్నావ్, నువ్వూ స్టాఫే కదా! నీ వాటా నీకందుతుందిలే వెళ్లు " అంటూ కసురుకున్నాడు. అక్కడున్న వారు వెకిలిలా నువ్వుకున్నారు. నిలువెల్లా తూట్లు పొడిచినంతగా విలవిలలాడాడు డేనియల్.

అక్కడ్నుంచి వరండాలో కొచ్చాడు. చిన్నచిన్న గ్రూపులుగా నిలుచొని కొంతమంది బేరాలు కుదుర్చుకుంటున్నారు బ్రోకర్స్‌తో.

'ఏం,ముసిలోడా, చీటి ఏది? కడుపునొప్పి మీ ఆడమనిషికా? ఆపరేషన్ కుదురుగా జరగాలనుకుంటున్నావా? ఇక్కడ సూది మందుతో పొడిపించుకున్నవారెందరికో ఎయిడ్స్ కూడా వస్తున్నాయ్. పేపర్లో చూడలేదా , నీ మంచికోరే చెపుతున్నాం. మా మాట

వింటారా" అంటూ మెల్లిగా బ్రెయిన్‌వాష్ చేయసాగాడు. వీళ్లెవరో, ఎందుకిలా మాట్లాడుతున్నారో అర్థం కాక ఆ ప్రక్కనే పోయి నిలుచున్నాడు డేనియల్.

" మంచి డాక్టర్ని చూపించి పుణ్యం కట్టుకోనాయనా"

" ఇక్కడైతే జబ్బు నయం కాదు కదా, బోల్డంత ఖర్చు. ఈ ప్రక్క వీధిలో నర్సింగ్ హోమ్ ఉంది. ఈ డాక్టర్ని తీసుకొస్తాం. తక్కువ ఫీజుతో మీ ఆపరేషన్ సక్సెస్ అవుతుంది.' అంటూ సర్ది చెప్పబోతుంటే డేనియల్ దగ్గరకెళ్లి అడ్డుపుల్ల వేశాడు. మాటా మాటా పెరిగింది. అరుపులు, కేకలు, కుమ్ములాడుకోవడానికి చొక్కాలు గంజుకున్నారు. నర్సులు, డాక్టర్లు, కాంపౌండర్లు అంతా గుమిగూడారు.

డేనియల్ క్రోధావేశంతో క్యాజువాల్టీ వార్డులో ఉన్న డాక్టర్స్‌కు ఫిర్యాదు చేశాడు.

డాక్టర్లు తమ స్వప్రయోజనాల కోసం బ్రోకర్లను నియమించుకున్నారన్న సంగతి అందరికీ తెలిసిందే.

డాక్టర్లు డేనియల్‌ను ఓ వింత జంతువునో, వింత రోగినో చూసినట్లు చూశారు.

'వీడెవడు కొత్తగా చేరిన స్వీపరా అని గొణుక్కుంటూ ఏమిటీ న్యూసెన్స్ చేస్తున్నారు. వాళ్ళు దగ్గర పెట్టుకొని పనిచేయ్. గొడవలు పడి కంప్లైట్స్ చేస్తే ఇంటికి పంపిజేస్తాం. వెళ్ళు వెళ్ళు అంటూ చీదరించుకుంటూ చీవాట్లు పెట్టారు.

డేనియల్ తల దిమ్మెక్కిపోయింది. తప్పు చేసింది ఒకరు దండన విధిస్తున్నదెవరికి తేల్చుకోలేక వెనుదిరిగివెళ్లిపోయాడు. మరో రోజు ఓపీలో హడావిడిగా తిరుగుతూ పనిచేసుకుంటున్నాడు డేనియల్. అప్పుడే ఆటో ఒకటి ఆసుపత్రి ఆవరణలోకి వచ్చి ఆగింది. వయసు మీరిన పేషెంట్ ఎమర్జన్సీ వార్డులోకి చేర్చాలని వీల్‌చైర్ కోసం అటూ ఇటూ పరుగెత్తుతూ ఒకాయన అడుగుతుంటే ఎవరూ సమాధానం చెప్పడంలేదు. డేనియల్ ముందుకొచ్చి వీల్‌చైర్ కోసం పరుగెత్తాడు.

'ఎంతకి బేరమాడావ్. అంత తొందరగా వుందా అంతా ఎకసెక్కంగా మాట్లాడుతూ అడ్డాడు వొకడు.

' వీల్‌చైర్ ఎవరికోసం, జబ్బు చేసిన వాడికా, జేబులు నింపుకునే వాడికా, లే, అడ్డులే' అంటూ చీదరించుకుంటూ బలంగా ముందుకు తోసుకెళ్లాడు డేనియల్.

'అబ్బో! చచ్చి మీ అయ్య ఎక్కడున్నాడో గాని, డబ్బంతా తనొక్కడే నొక్కి జారుకునేవాడు.

అప్పుడేమో మీ అయ్య మా నోటికాడ మన్ను కొడితే, అడు చచ్చాక నువ్విలా తయారయ్యావు. నిన్నిలా వదిలిపెట్టకూడదు అంటూ  అంతా గుమిగూడి డేనియల్ వైపు గుర్రుగా చూశారు.

ఎమర్జన్సీ వార్డులోని పేషెంట్ ట్రీట్‌మెంట్ కోసం మేల్ నర్సు మందుల చీటి తెచ్చి అర్జంటుగా మందులు కొనుక్కొని రమ్మని చెప్పి చీటి అందించాడు.

తెచ్చి  ఇచ్చిన మందులన్నీ వాడేశామన్నారు గాని  పేషెంట్ మాత్రం నార్మల్‌గానే చనిపోయాడు. అక్కడే తిరుగుతూ పనిచేస్తున్న డేనియల్ చూస్తుండగానే పేషెంట్ ముఖాన్ని పూర్తిగా కప్పేశారు. డాక్టర్ గారు ఈ కేసుని ఎంఎల్‌సి అంటున్నారు. రెండు వేలిచ్చి కామప్‌చేసుకోండి. లేకపోతే పోలీసుస్టేషన్‌కి, కోర్టులకు తిరగలేరు.' అంటూ కాంపౌండర్ ఉచిత సలహా ఇస్తూ చెప్పాడు.

వయసు పైబడి చనిపోతే ఎంఎల్‌సి ఎలా అవుతుంది. తండ్రి ప్రాణం దక్కించుకునే శక్తి లేకపోయినా అవినీతి చిక్కుముడిని ఎలా విప్పుకోవాలో తెలియక దహించుకుపోయాడు కొడుకు.

జరుగుతున్న దుర్భర పరిస్థితిని చూసి చలించిపోయాడు డేనియల్. వైద్యం కన్నా ముందు డాక్టర్ రేటు ఖరారుచేసుకోవడం ఎంత హీనాతిహీనం.  ఒక్క క్షణం డేనియల్ పాత జ్ఞాపకాల ప్రపంచంలోకి వెళ్ళాడు. ఇటువంటి అమానుషమైన వాతావరణంలో  తన తండ్రి కూడా  ఒక భాగస్థుడయ్యేవాడని, జేబులో చిరిగిన నోట్లు కుక్కుకుంటూ నాటుసారాతో కడుపునింపుకొని ఇంట్లో అందరినీ హింసించడం, మళ్ళీ అదే పంథాలో తను ఏనాటికీ  చిక్కుకోకూడదనుకున్నాడు. తనకి దయార్ద్రహృదయంతో నౌకరి ఇచ్చిన సూపరింటెండెంట్ దగ్గరకెళ్ళి, జరిగినదంతా ఏకరవుపెట్టాడు.

ఓచిన్న ఉద్యోగి అంత ధైర్యంగా ఫిర్యాదుచేస్తున్నాడంటే అందులో నిజనిజాలు దర్యాప్తు చేయాలని నిశ్చయించుకున్నాడు.

ప్రతీ నెలా వేలాది రూపాయలు జీతం పుచ్చుకుంటూ  విధులకు హాజరు కాకుండా ప్రైవేటు పనులు చేసుకుంటున్న వారందరిక నోటీసులు జారీ చేసినందుకు, ఎటూ తూగలేక తలనొప్పి వ్యవహారంగా సాగుతున్న సమయంలో మరో కొత్త సమస్య తలెత్తడం సూపరింటెండెంట్‌కి మనస్థాపం మరింత ఎక్కువైంది.

డేనియల్‌పై అందరికీ కంటగింపుగా ఉంది. అతడి కంటపడకుండా మామూలుగా

మామూళ్ళతో  పనిచేసుకు పోసాగారు.

డాక్టర్లు కూడా డేనియల్‌పై ఎన్నో చాడీలు చెప్పారు.

పని కష్టంగా ఉన్న గైనిక్ వార్డుకి  డేనియల్‌ను పంపారు.

లేడీ డాక్టర్ దగ్గర ఎంతో ఒద్దికగా, విధేయంతో  పనిలో నిమగ్నమయ్యాడు డేనియల్ గైనిక్ వార్డు అంటే అందర్నీ బెంబేలెత్తించే దోమలు స్వైరవిహారం చేస్తుంటాయి. కిటికీల గుండా దుర్గంధభూయిష్టమైన గాలి, పెచ్చులూడిన గోడలు, తుప్పుపట్టిన మంచాలు, చిరిగిన పరుపులు, దుప్పట్లు ఆ వార్డులో పనిచేయడమంటే ఎంతో శిక్ష అనుభవించినంత కలవరపెడుతుంది. గైనిక్ వార్డులో  రోజులు దొర్లుతున్న  కొద్దీ వింతవింత పోకడలు కనిపించాయి  డేనియల్‌కి.

ఆడపిల్ల కంటే రెండొందలు బక్షీష్. మగ పిల్లాడైతే అయిదొందలు ఆనవాయితీ. అది ఉల్లంఘిస్తే ఏ పాపం ఎరుగని పసికందుని చిత్రవధకు గురిచేస్తారు తోటీలు ఇదంతా చూస్తున్న డేనియల్ హృదయం చిద్రమైపోయింది. ఒకమారు అనుకోని దుస్సంఘటన జరిగింది. ఒక పసికందు శవమై చెత్తకుండీలో దొరికింది. ఇదే ఆసుపత్రి ఆవరణలోనే జరగడంతో  ఆవార్డు లేడీ డాక్టరే బాధ్యత వహించాల్సివచ్చింది. సస్పెండ్ జరిగిన పది రోజుల్లో నిశ్చింతంగా అక్కడే పోస్టింగ్ తెచ్చుకొని స్థిరపడిపోవడానికి ఎన్ని లక్షలు జల్లిందో, ఎన్ని పైరవీలు చేసిందో, అధికారం ముందు తనెంత చిన్నవాడో డేనియల్‌కి పూర్తిగా అర్థమైంది.

ఎప్పటిలాగే యథావిధిగా డేనియల్ వార్డులోకి రాగానే స్టోర్ దగ్గర అరుపులు, కేకలు వినిపించాయి. ఆ సమయంలో డేనియల్ పేరు అదే పనిగా వినిపించడంతో దగ్గరగా వెళ్ళి నిలుచున్నాడు.

'డేనియల్ కొత్తగా చేరాడని, ఏమీ తెలియదంటారేం, అన్ని పనులు మేమే చేయాలా, అతడికి చెప్పండి. పెద్ద మొనగాడిలా అందరినీ కామెంట్ చేస్తాడుగా' అంటు తిరుగుబాటు ధ్వజమెత్తాడు మరొకడు.

డేనియల్ పౌరషంగా ముందుకొచ్చి 'ఏం పని సార్, చెప్పండి, చేస్తాను. దొంగెత్తులేసే రకం కాదు నాది" అని తనని తాను సమర్ధించుకున్నట్లు అన్నాడు.

స్టోర్ ఇన్‌చార్జి ఒక అట్టపెట్టె తెచ్చి ఇస్తూ, 'ఈ ప్యాకెట్ రిటర్న్ చేయాలి. సూపరింటెండెంట్ గారు కోప్పడుతున్నారు. ఎక్సెస్ మెడిసన్స్ ఇంకా ఎందుకు ఉంచుకున్నారని, ఈ పాకెట్

ఇవ్వండి అంటూ ఇన్‌చార్జి డేనియల్ చేతిలో పెట్టాడు.

ఆ మాత్రం దానికి అంత రాద్ధాంతం దేనికి? అని హుషారుగా అందుకుని బయలుదేరాడు.

మెదుడులో సవాలక్ష ఆలోచనలు మొదలయ్యాయి.

మెడిసన్స్ తిరిగి పాపుకి ఇవ్వడమేమిటి? ఆసుపత్రి మందులు ఎంతోకాలంగా బయట వారికి అమ్మతూ ధనార్జన చేస్తున్నట్లు ప్రజావాక్కు వినిపిస్తూనే ఉంది. అయితే అదే బాపతులో ఈ ప్యాకెట్ కూడా దాటిపోతున్నదా?

పేదల్ని ఆదుకునే ఆసుపత్రి అనే ఆశతో కుక్కకాటు బాధపడేవారు రోజు నలుగురైదుగురు వస్తూనే ఉంటారు. గాయాన్ని బట్టి,రెండు మూడు, అయిదు సి.సిలు చొప్పున ఇవ్వవలసి ఉంటుంది. అయితే రోగికిచ్చే డోసులోనే తక్కువ చేసి వ్యాక్సిన్ మిగిల్చి ప్రైవేటుగా విక్రయించుకుంటూ సంపాదన పెంచుకోవడం పరిపాటయిపోయింది అని తీవ్రంగా ఆలోచించి నేరుగా హాస్పటల్ సూపరింటెండెంట్‌కు రిపోర్టు చేయాలని చేయాలని వెళ్ళాడు. ద్వారపాలకుడు పర్మిషన్ ఇవ్వలేదు. పావుగంట తరువాత మెల్లగా లోనికి దూరాడు. ఎవరితోనో ఫోన్‌లో సీరియస్‌గా మాట్లాడుతున్నారు సూపరింటెండెంట్. ఫోన్ డిస్‌కనెక్ట్ కాగానే డేనియల్ తన చేతిలోని పాకెట్‌ను ఆయన టేబిల్‌పై పెడుతూ ఏదో మాట్లాడబోయేసరికి సూపరింటెండెంట్ డాక్టర్ ముఖంలో విపరీతమైన క్రోధావేశం కనిపించింది. డేనియల్ గుండె చప్పుడెక్కువైంది. కాలింగ్‌బెల్ కొట్టాడు సూపరింటెండెంట్. ఫ్యూన్‌తో సహా డాక్టర్లు, స్టాఫ్ నర్సులు లోపలికి వచ్చారు. ఎ.సి రూంలో డేనియల్‌కి ముచ్చెమటలు పట్టాయి. సార్... ఏదో చెప్పబోయేసరికి, ' డోంటాక్ నీ నంగిరి వేషాలు నా దగ్గర వేయకు, తండ్రిలేని వాడివి కదా అని దయ తలచి ఉద్యోగమిచ్చాము. మాకే బురిడీలు కొడుతున్నావ్, ఇప్పటికే నీమీద ఎన్నో కంప్లైంట్స్ వచ్చాయి. నమ్మలేదు. చివరికి మందులు దొంగలించే స్థితికి వచ్చావ్. అందరికీ తెలిసిపోయిందని ప్లేట్ ఫిరాయించి నా దగ్గరికొచ్చావ్, నిన్ను ఈ ఉద్యోగం నుండి వెంటనే తొలగిస్తున్నాం. పోలీసులకు కూడా కంప్లైంట్ ఇచ్చాం' అంటున్న సూపరింటెండెంట్ మాటల్లోనే టపటపమని బూట్ల శబ్దంతో స్ప్రింగ్‌డోర్ తెరుచుకొని లోపలికి వచ్చారు పోలీసులు.

డేనియల్ నోటి వెంట మాటలు రాలేదు. కళ్లు బైర్లుకమ్మాయి. అధికారుల ముందు అసమర్ధుడిలా కనిపించే డేనియల్ మెడ మీద పోలీసుల చేయి పడింది.

ఆంధ్రభూమి డైలీ, ఆగస్టు 2003